క్లుప్తంగా

21న వైఎస్సార్ సీపీ సమావేశం

కడియం: ఈ నెల 21వ తేదీన సమావేశం ఏర్పాటు చేసినట్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తెలిపారు. స్థానిక గిరజాల కల్యాణ మండపంలో ఆరోజు సాయంత్రం 5 గంటలకు జరిగే ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ పాల్గొంటారన్నారు. పార్టీ సభ్యులు ఈ సమావేశానికి హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

చదరంగంతో ఆలోచనా విధానం మెరుగు



వేసవి విజ్ఞాన శిబిరంలో చెస్‌లో తలపడుతున్న విద్యార్థులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): చదరంగం ఆడటం వలన విద్యార్థుల ఆలోచనా విధానం మెరుగుపడుతుందని చెస్ కోచ్ కంచుమర్తి జగన్నాథం తెలిపారు. ఆదివారం స్థానిక ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పుస్తక పఠనం, నీతికథలు చెప్పడంతో పాటు యోగా, చదరంగం తరగతులు నిర్వహించారు. ట్రస్ట్ సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యం, బొడ్డు శ్రీనివాసు, వంగపండు హరనాథ్, పాడిపిరెడ్డి కృష్ణ, మతల రమేష్ పాల్గొన్నారు.

5న ఉద్యోగుల సంఘ కౌన్సిల్ సమావేశం



వాల్ పోస్టర్ ఆవిష్కరించిన గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరం సిటీ: జూన్ 5వ తేదీన విజయవాడలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తూర్పు గోదావరి జిల్లా శాఖ అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి సి.హెచ్.ఎస్. విల్సన్ పాల్, సహ అధ్యక్షుడు డి.ఎస్. చంబర్లీన్ మాట్లాడారు.

కులమతాలు అహేతుకం

కడియం: దైవజ్ఞానం ప్రకారం కులమతాలు అహేతుకమని త్రైత సిద్ధాంతి ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ అధ్యక్షుడు శేఖర్‌బాబు అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వేమగిరిలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత భగవద్గీత శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కర్మయోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానాన్ని తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ ప్రచారం చేస్తున్నామన్నారు. బి.లోమిత, కే.శోభారాణి, సూర్యకుమారి, విజయ్, లక్ష్మీనారాయణ, జైకుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

కంబాలచెరువు: స్థానిక పీ అండ్ టీ కాలనీకి చెందిన వల్లూరు వెంకటరమణాచారి అదృశ్యమైన సంఘటనపై రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. కార్పెంటర్‌గా పనిచేసే రమణాచారి ఈ నెల 15న పనికి వెళ్లాడు. అయితే తనకు ఒంట్లో బాగోలేదని పని నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి అతను కనిపించడం లేదు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'నిడిగట్ల'

రాజానగరం: మండలంలోని సీతారామపురంలో జరుగుతున్న శివాజీ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో నిడిగట్ల టీమ్ విజేతగా నిలిచింది. అడబాల తేజ, సూరపురెడ్డి వాసు, గ్రామ యువత ఆధ్వర్యంలో 15 రోజులుగా జరుగుతున్న ఈ టోర్నమెంట్స్‌లో 32 గ్రామాల నుంచి 32 టీమ్‌లు విజయం కోసం తలపడ్డాయి. అయితే ఫైనల్‌గా జరిగిన పోరులో గాదరాడ టీమ్‌తో నిడిగట్ల టీమ్ పోటీపడింది.

సినిమాలు

శ్యామల	: శుభం
సూర్యమినీ	: ఫైనల్ డెస్టినేషన్
సూర్యప్యాలెస్	: మిషన్ ఇంపాజిబుల్
స్వామి	: మిషన్ ఇంపాజిబుల్
శివజ్యోతి	: హిట్-3
అనుశ్రీ	: ఫైనల్ డెస్టినేషన్
రాజా	: ఫైనల్ డెస్టినేషన్
ఊర్వశి	: లవ్‌లీ
మేనక	: ఎలెవన్
రంభ	: 23
కుమారి	: మిషన్ ఇంపాజిబుల్
అప్సర	: సింగిల్
అశోక నామవరం	: ఫైనల్ డెస్టినేషన్
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: మిషన్ ఇంపాజిబుల్
మురళీకృష్ణ కడియం	: మిషన్ ఇంపాజిబుల్, సింగిల్
వెంకటసూర్య	: ఫైనల్ డెస్టినేషన్

కోతులతో వెతలు

- ఆవేదన వ్యక్తం చేస్తున్న హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు
- ఏమాత్రం పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు



హౌసింగ్ బోర్డు కాలనీలో గుమిగూడిన కోతులు

రాజమహేంద్రవరం సిటీ: ఉదయం లేదు... సాయంత్రం లేదు తమ నివాసాలపై కోతులు దాడి చేస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని హౌసింగ్ బోర్డు కాలనీ వాసులు కోరుతున్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో కోతులు ఇళ్ల పైకి దూసుకు వస్తూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులపై కోతులు దాడులు చేసి గాయపరుస్తున్నాయని దీంతో చిన్నారులను బయటికి పంపాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొందంటూ మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఇళ్లపై, ప్రజలపై దాడులు చేస్తున్న కోతులను బంధించి ఏజెన్సీ ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని స్థానికులు ముక్తకంఠంతో విజ్ఞప్తి చేస్తున్నారు. కోతులపై చర్యలు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏ విధమైన చర్యలు చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. నిత్యం కోతులంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల వద్ద వస్తువులు పట్టుకుని వెళ్లిపోతున్నాయని, వాటిని నియంత్రించలేక పోతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు వచ్చే సమయంలో బయటకు రావాలంటేనే భయపడాల్సిన దుస్థితి నెలకొందని, దీంతో ఇంట్లోనే ఉండాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు. చిన్నారులు భోజనం చేసే సమయంలో కోతులు దాడులకు పాల్పడుతున్నాయని దీనివల్ల చిన్నారులు భయంతో బెంబేలెత్తిపోతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోతులు గుంపులు గుంపులుగా ఇళ్లపైకి వచ్చి పెంకులు, రేకుల షెడ్డులను ధ్వంసం చేస్తున్నాయని ఇది చాలా ఇబ్బందికరంగా తయారైందని అంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఈ విషయమై చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కోతులు బెడద నిత్య నూతనంగా కొనసాగుతుందని తమ బాధలు ఎవరికీ చెప్పుకున్నా తీరడం లేదంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఎన్ని వినతులు ఇచ్చినా ఏ విధమైన కనికరం చూపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలను బయటికి పంపించాలంటే భయం



కోతులు భయంతో చిన్నారులను ఇంటి నుంచి బయటికి పంపించాలంటేనే భయం భయంగా ఉంటోంది. కోతులు వచ్చే సమయంలో ఇంట్లో చొరబడకుండా తలుపులు మూసుకుని లోపల ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. బయటకు రావాలన్నా కోతులు ఎక్కడా దాడి చేస్తాయో అని అన్న భయం వెంటాడుతోంది. అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలి.

– తరంగణి, స్థానికురాలు

అధికారులు పట్టించుకోవడం లేదు



కోతుల భయంపై అధికారులకు చర్యలు చేపట్టాలని ఎన్ని విజ్ఞప్తులు చేసినా ఇప్పటివరకు ఏ విధమైన చర్యలు చేపట్టలేదు. మా ఇబ్బందిని ఎవరికీ చెప్పాలో తెలియడం లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ తదితర అధికారులు చర్యలు చేపట్టాలి. కోతులు గతంలో చాలాసార్లు దాడులు చేసి గాయపరిచాయి. ఈ గాయాలను తగ్గించుకోవడానికి హాస్పిటల్‌కి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికైనా అధికారులు కోతుల ఇబ్బందులు తొలగించే చర్యలు చేపట్టాలి.

– మీనా, స్థానికురాలు

బాధలు తొలగించండి సార్



కోతులు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కోతుల వల్ల రోజూ ఇబ్బంది పడుతున్నా అధికారులు మా వైపు కన్నెత్తి చూడడం లేదు. మేము పడుతున్న బాధలు ఏ అధికారికీ కనిపించడం లేదు. వినిపించడం లేదు. ఇప్పటికైనా మా బాధలను దృష్టిలో ఉంచుకుని అధికారులు కోతుల బాధలు తప్పించే చర్యలు చేపట్టాలి.

– లక్ష్మమ్మ, స్థానికురాలు

ప్రజల దృష్టి మరల్చేందుకే అక్రమ అరెస్టులు



రాజేష్

రాజమహేంద్రవరం రూరల్: చంద్రబాబు ప్రభుత్వం తన పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే రిటైర్డు అధికారులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని జిల్లా వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లిక్కర్ స్కామ్ జరగకపోయినా జరిగినట్లు తప్పుడు వాంగుల్మాలు సృష్టించి రిటైర్డు అధికారులు ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అక్రమంగా అరెస్టు చేశారన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతోపాటు పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు, ప్రజల దృష్టి మళ్లించేందుకే రాజకీయ కక్ష సాధింపు చర్యలు, అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజకీయ అరాచకం ఎక్కువైందని, దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయ నాయకులపైనే కాకుండా ఐఏఎస్, ఐపీఎస్‌లపై కూడా అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. హామీల అమలును విస్మరించి కక్ష పూరిత రాజకీయాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని పెయ్యల రాజేష్ పేర్కొన్నారు.

బదిలీల్లో 'ఉత్తమ' ఉపాధ్యాయులకు అన్యాయం

కడియం: ఉపాధ్యాయ బదిలీల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ప్రత్యేక పాయింట్లు కేటాయిస్తోందన్నారు. స్కౌట్ అండ్ ఎస్‌సీసీ, రాష్ట్ర సంఘ నాయకులు, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు పొందినవారికి పాయింట్లు కేటాయించలేదని పేర్కొన్నారు. గత బదిలీల్లో ఉత్తమ ఉపాధ్యాయులకు పాయింట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఈసారి బదిలీల్లో మాత్రం వీరికి అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రముఖుల విగ్రహాలతో భావితరాలకు స్ఫూర్తి



విగ్రహాలను ఆవిష్కరించిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ : ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిస్తుందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం వీఎల్ పురం సెంటర్‌లో వెలమ సంక్షేమ సంఘం, వెలమ ఉద్యోగుల సంక్షేమ సంఘం, వెలమ యువత ఆధ్వర్యంలో నెలకొల్పిన మాజీ కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు, బొబ్బిలి పులిగా చరిత్రలో నిలిచిపోయిన తాండ్ర పాపారాయుడు విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడారు.

బొమ్మూరులో తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న కూటమి నేతలు

రాజమహేంద్రవరం రూరల్: పహల్గాం ఉగ్రమూకల దారుణకాండలో అసువులు బాసిన భారత పౌరులకు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సైనికుడు మురళీనాయక్‌ల ఆత్మశాంతి కలగాలని కూటమి నాయకులు ప్రార్థించారు. ఆదివారం బొమ్మూరు దోసాలమ్మగుడి సెంటర్ నుంచి బాలాజీపేటకు కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయ్యినందుకు తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ఆనాటి స్నేహం... తిరిగిరాదు నేస్తం



రజక సేవ సంఘం ఫంక్షన్ హాల్‌లో గురువులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



వీరవరం స్కూల్‌లో కలుసుకున్న 1999-2000 పదవ తరగతి విద్యార్థులు

విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సత్కారం

సీటీఆర్ఐ: వారంతా ఒక్కసారిగా చిన్న పిల్లలు అయిపోయారు. తమ చదువుకున్న రోజులలో చేసిన అల్లరి గుర్తుకు తెచ్చుకుని ఆనాటి సంగతులు నేమరువేసుకున్నారు. 30 సంవత్సరాల తరువాత కలుసుకున్న వారందరూ ఒకరినొకరు పోల్చుకుంటూ, ఆట పట్టించుకుంటూ అల్లరి చేశారు. స్థానిక రజక సేవ సంఘం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. వివరాలలోకి వెళితే.... స్థానిక బీఈఎం హైస్కూల్‌లో 1992లో పదవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు తరువాత చదువుల కోసం వేర్వేరు చోట్లకు వెళ్లిపోయారు. తరువాత, ఉద్యోగం, బిజినెస్, కుటుంబ బాధ్యతల కారణంగా తిరిగి మళ్లీ కలవలేకపోయారు. వీరిలో కొందరూ ఉపాధ్యాయులుగా, మరికొందరు వ్యాపారవేత్తలుగా, ఆర్మీ, ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ సంస్థలలో విధులు నిర్వహిస్తున్నారు. అందరూ మళ్లీ తిరిగి కలుసుకోవాలని ఒక వాట్సాప్ గ్రూప్‌ని ఏర్పాటు చేసి ఆదివారం కలుసుకున్నారు. మహిళలు వివిధ గేమ్స్‌లో పోటీ పడి తమ చిన్ననాటి రోజులకు వెళ్లిపోయారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగిన ఈ కార్యక్రమంలో అందరూ ఆనందంతో చిందులు వేశారు. విడిపోయి వెళ్లి పోయేటప్పుడు వారందరూ భావోద్వేగానికి గురయ్యారు. వై.విజయప్రతాప్, చిట్టిబాబు, శారద, జనార్దన్ టీచర్స్‌ను సత్కరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


కడియం: మండలంలోని వీరవరం ఉన్నత పాఠశాలలో 1999–2000 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలుసుకున్నారు. అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. స్కూల్‌లో మొక్కలు నాటారు. తామంతా ఒక్క చోటకు చేరేందుకు కృషి చేసిన మిత్ర బృందాన్ని అభినందించారు.

కూలిన విద్యుత్ స్తంభం

సీతానగరం: ఈదురు గాలులు, వర్షాలకు పురుషోత్తపట్నంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో స్థానిక ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారు. పురుషోత్తపట్నం కొత్త కాలనీలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు, వర్షాలకు వ్యవసాయ బోర్లకు అందించే విద్యుత్ స్తంభం విరిగి రోడ్డుకు అడ్డుగా పడింది. విద్యుత్‌శాఖ సిబ్బంది కూలిన స్తంభం నుంచి వైర్లు వేరు చేసి, ఇళ్లకు అందించే విద్యుత్ లైన్ ద్వారా వ్యవసాయ మోటార్లకు విద్యుత్ లైన్ కలిపారు. అయితే స్తంభాన్ని రోడ్డుపై అలాగే వదిలేశారు. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు స్తంభం దాటే సమయంలో పడిపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల విద్యుత్ లైన్‌కు వ్యవసాయ బోర్ల లైన్ కలపడంతో లో ఓల్టేజ్ సమస్య ఉంటుందన్నారు.

పండులోనూ పోషక విలువలు మెండు

- జీడిమామిడి గింజలకే ప్రాధాన్యమిస్తున్న రైతులు
- పండ్లను తోటల్లో చెట్ల కిందే వదిలేస్తున్న వైనం
- ఏటా లక్షల టన్నులు వృథా



జీడిమామిడి పండ్లు



కలవచర్ల కేవీకేలో జీడిమామిడి పండ్ల వినియోగంపై మహిళలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: మెట్ట ప్రాంతంలో రైతాంగానికి అధిక ఆదాయాన్ని సమకూర్చే పంటలలో జీడిమామిడి ప్రధానమైనది. వేసవి పంటగా రైతులకు ఫలసాయాన్ని, ప్రభుత్వాలకు విదేశీ మారక ద్రవ్యాన్ని అందిస్తుంది. జీడిగింజల ద్వారానే రైతులకు ఆదాయం వస్తుందనేది అందరికీ తెలిసిన విషయమే. అందుకనే దేశంలో జీడిమామిడి సాగు ఎక్కువగా జీడిగింజల కోసమే అన్నట్టుగా ఉంటుంది. అయితే జీడిగింజల ఉత్పత్తికి ప్రధాన కారణంగా ఉన్న జీడిమామిడి పండ్లను మాత్రం పెద్దగా పట్టించుకోరు. దీంతో తోటల్లో చెట్లకిందనే అవి రాలిపోతూ, కుళ్లిపోతూ ఉంటాయి. ఈ విధంగా దేశంలో సాలీనా 40 లక్షల టన్నుల జీడిమామిడి పండ్లు తోటల్లో వృథా అవుతున్నాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి.

మంచి రంగు, రుచి, ఘాటైన వాసన కలిగివున్న జీడిమామిడి పండు తినగానే గొంతులో ఒకరకమైన జీర కలిగివుండటం వలన చాలామంది దీనిని తినడానికి ఆసక్తిని చూపించరు. అంతేకాక ఒకటి, రెండు రోజులకు మించి నిల్వ చేసుకునేందుకు అవకాశం లేని పండు కావడం, త్వరగా కుళ్లిపోయే స్వభాగం కలిగివుండడంతో జీడిమామిడి పండ్లు ఎక్కువగా తోటల్లో రాలిపోతూ, భూమిలోనే కలిసిపోతున్నాయి. వాస్తవానికి వీటిలో అనేక రకాల పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయి. అందుకనే వీటి వినియోగంపై దేశ వ్యాప్తంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) గ్రామీణ రైతు మహిళలకు శిక్షణ ఇస్తూ, కుటీర పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి.

పలు రకాల ఆహార ఉత్పత్తులు

జీడిమామిడి పండ్లతో పలురకాల ఆహార పదార్థాలను తయారుచేసుకోవచ్చు. వీటి రసంతో శీతల పానీయాలు, గుజ్జుతో జామ్, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, చట్నీ, ఊరగాయ, కాండీ, టూటీ ఫ్రూటీ, టాఫీ, వినిగర్, చాకెట్లు (టాఫీలు), చాక్లెట్ బార్లు తయారుచేయవచ్చు. గోవాలో అత్యంత ఫేమస్‌గా లభించే 'ఫెన్నీ' అనే మత్తు పానీయం జీడిమామిడి పండ్ల రసం నుంచే తయారవుతుంది.

రసం తీసే విధానం

బాగా ముగ్గిన జీడిమామిడి పండ్లను సేకరించి, నీటితో శుభ్రం చేసిన తరువాత చేతులతోగాని, ప్రత్యేక మెషీన్‌తోగాని రసాన్ని తీస్తారు. ఇందుకు జ్యూస్ ఎక్స్‌ట్రాక్టర్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. దీనివల్ల పండు నుంచి 70 శాతం రసాన్ని తీయడమే కాకుండా గంటకు 150 కిలోల పండ్ల నుంచి రసాన్ని తీసేందుకు అవకాశం ఉంటుంది. ఈ రసంలో ఉన్న టెనిన్స్‌ని (గొంతులో జీరను కలిగించే వగరు) తొలగించడానికి సగ్గు బియ్యంతో తయారుచేసిన గంజిని ఉపయోగిస్తుంటారు. అదెలాగంటే ఒక లీటరు జీడిమామిడి పండ్ల రసం కోసం రెండు గ్రాముల సగ్గు బియ్యం పొడిని తీసుకుని, చల్లటి నీటిలో కరిగించి, ఆ తరువాత స్టీలు లేదా మట్టి పాత్రలో మరగబెట్టి చల్లార్చాలి. దానిలో ఒక లీటరు రసాన్ని కలిపి కదపకుండా రెండు గంటలపాటు ఉంచాలి. ఆ తరువాత ఆ పాత్రలో పైకి తేరిన రసం వాడుకోవచ్చు. ఈ ప్రాసెస్‌లో ఇనుప, రాగి పాత్రలను మాత్రం ఉపయోగించవద్దు. ఈ విధంగా తయారైన రసంతో శీతల పానీయం, సిరప్, జ్యూస్‌లను తయారు చే సుకోవచ్చు. రసం తీయగా మిగిలిన గుజ్జుతో జామ్, మిక్స్‌డ్ ఫ్రూట్ జామ్, చట్నీలు తయారు చేయవచ్చు. జీడిమామిడి పండ్లతో మామిడి కాయల మాదిరిగా ఆవకాయ పెట్టవచ్చు. తీరిక సమయంలో తినేందుకు పొటాటో చిప్స్ మాదిరిగా చిప్స్ కూడా తయారు చేసుకోవచ్చు.

పిప్పితో ఉపయోగాలు

- జీడిమామిడి పండు నుంచి రసం తీసిన తరువాత వచ్చే పిప్పిని ఎండబెట్టి పశువులకు, కోళ్లకు దాణాగా ఉపయోగించుకోవచ్చు
- వర్మీ కంపోస్టుగాను ఉపయోగపడుతుంది. ఈ కంపోస్టులో 1.60 శాతం నత్రజని, 0.44 శాతం భాస్వరం, 0.58 శాతం పొటాషియం ఉంటాయి.
- గోవా రాష్ట్రంలో ఈ పిప్పిని లిక్కర్ తయారీకి వాడతారు.
- ఈ పిప్పి నుంచి 'పెక్టిన్' అనే ముఖ్యమైన ఉత్పత్తిని తయారు చేయవచ్చు. ఇది జామ్, చాస్, జెల్లీ, కెచప్ తయారీలలో చిక్కదనం రావడానికి తోడ్పడుతుంది. పలు రకాల మందుల తయారీలోను, పౌడర్లు, పేస్టుల తయారీలోను కూడా వాడతారు.

100 గ్రాముల జీడిమామిడి పండులో ఇలా..

పోషక విలువలు (శాతంలో)				
తేమ	కొవ్వు పదార్థాలు	మాంసకృత్తులు	పిండి పదార్థాలు	భాస్వరం
87.9	0.1	0.2	11.6	10.0
పోషక విలువలు (మి.గ్రా.)				
ఐరన్	కాల్షియం	విటమిన్-సి	రిబోఫ్లావిన్	విటమిన్-ఏ
0.2	10.0	26.1	0.5	39.1

పోషక విలువలతో కూడిన ఔషధకారి



జీడిమామిడి పండు అనేక రకాల పోషక విలువలతో కూడిన ఔషధకారి. ఆ విషయం తెలియక చాలామంది వీటిని ఆహారంగా తీసుకునేందుకు ఆసక్తిని చూపరు. అందుకనే ఎంతో విలువైన పండ్లు కుళ్లిపోయి, నేలపాలవుతున్నాయి. ఈ విషయంలో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా జీడిమామిడి పండ్లతో ఏఏ రకాల ఆహార పదార్థాలను, రసాలను, జ్యూస్‌లను, జామ్‌లను తయారు చేయవచ్చునో గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు శిక్షణ ఇస్తున్నాం. వీటితో మామిడి కాయల మాదిరిగా ఆవకాయ పచ్చడి కూడా పెట్టుకోవచ్చు. అదెలాగో శిక్షణలో తెలియజేస్తున్నాం.

–డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు, ప్రధానాధికారి, కృషి విజ్ఞాన కేంద్రం, కలవచర్ల, తూర్పుగోదావరి జిల్లా

950 మంది మహిళా రైతులకు శిక్షణ ఇచ్చాం



రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లా, పలాస తరువాత జీడిమామిడి పప్పు పరిశ్రమకు కోనసీమ జిల్లాలోని మోరి పేరొందింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 30 వేల హెక్టార్లలో జీడిమామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. అయితే ఇక్కడ జీడిమామిడి గింజలు తీసుకుని, పండ్లను తోటల్లోనే వదిలేస్తుంటారు. కేరళ, గోవా రాష్ట్రాలలో మాదిరిగా జీడిమామిడి పండ్లను కూడా వినియోగంలోకి తీసుకువచ్చేందుకుగాను డీసీసీడీ కొచ్చిన్ (కేరళ) సహకారంతో కేవీకేలో బ్యాచ్‌ల వారీగా ఏడు సంవత్సరాల నుంచి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 950 మంది మహిళా రైతులకు శిక్షణ ఇచ్చాం.

– జేవీఆర్ సత్యవాణి, గృహ విజ్ఞాన విభాగం అధికారి, కేవీకే, కలవచర్ల, తూర్పు గోదావరి జిల్లా

నిరుద్యోగ యువతకు ఉపాధిని చూపవచ్చు

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ద్వారా జీడిమామిడి పండ్లను కూడా ఉపయోగంలోకి తీసుకువచ్చే ప్రాసెస్‌ని చేపడితే రాష్ట్రంలో ముఖ్యంగా జీడిమామిడి తోటలు ఉన్న మెట్ట ప్రాంతాలలో నిరుద్యోగ యువతకు ఉపాధిని చూపవచ్చు. ఈ పండ్ల నుంచి తీసిన రసాన్ని యాప్పీ, ఫ్రూటీ, మాజాల మాదిరిగా టెట్రా ప్యాకింగ్ చేసి విక్రయించే ప్రక్రియ ద్వారా యువతకు ఉపాధి లభిస్తుంది. కేరళలో ఇప్పటికే జీడిమామిడి పండ్లతో తయారు చేసిన రసాన్ని శీతల పానీయంగా విక్రయిస్తున్నారు.

ఔషధకారిగా జీడిమామిడి పండు

- తాను పండిపోయి జీడిగింజను తయారుచేసి, చెట్టు నుంచి రాలిపోయే ఈ జీడిమామిడిలో ఎన్నో పోషక విలువలు, ఔషధ గుణాలు ఉన్నాయనే విషయం చాలామందికి తెలియదు. ఈ పండులో లభ్యమయ్యే సి-విటమిన్ నిమ్మజాతుల కంటే సుమారు 5 రెట్లు అధికంగా ఉంటుంది. పసుపు, ఎరుపు, గులాబి రంగులలో దొరికే ఈ పండ్లలో 85 శాతం రసం, 10 శాతం చక్కెర ఉంటాయి. రసంలో ఫ్రక్టోజు, గ్లూకోజు, సుక్రోజు, మాల్టోజు, మాలిక్ ఆమ్లం ఉంటాయి.
- జీడిమామిడి పండు మంచి ఔషధకారిగా పనిచేస్తుంది. ఉదర సంబంధ వ్యాధులైన జిగట, నీళ్ల విరోచనాల నివారణకు, స్కర్వీ వ్యాధిని అరికట్టడానికి బాగా ఉపయోగపడుతుంది.
- మూత్ర పిండాల సమస్యలు, కలరా, డ్రాప్సీ వ్యాధి నివారణకు ఉపకరిస్తుంది. జీడిమామిడి పండు ఆరగించడం ద్వారా అరికాళ్ల పగుళ్లను కూడా నివారించవచ్చు.
- జీడిమామిడి రసంతో తయారుచేసిన 'ఫెన్నీ' అనే మత్తు పానీయం పెద్దలకు, పిల్లలకు సంబంధించిన అనేక వ్యాధుల నివారణకు ఉపయోగపడుతుంది.
- వీటి విత్తనాలతో తయారుచేసిన పొడ పాము కాటుకు విరుగుడుగా కూడా ఉపయోగిస్తుంటారు.